# తృప్తి

- ఎం. శ్రీలక్ష్మి




ఆ రోజు వాన కురిసి వెలసినప్పటి ప్రశాంతత ఆఫీసు నిండా అలుముకుని వున్నది. గత వారం రోజులుగా ఇన్‌స్పెక్షన్ జరిగి ముగియడంతో ఎవరి సీట్లలోను పెండింగ్ వర్క్ లేదు. అందరూ రిలాక్స్‌డ్‌గా ఫీలవుతున్నారు.

నేను కూడా పని పెద్దగా లేకపోవడంతో సీట్లో విశ్రాంతిగా కూర్చుని ఆఫీసుకు వచ్చిపోయే వాళ్ళను గమనిస్తున్నాను. ఇంతలో ఓ ఇరవై సంవత్సరాల కుర్రవాడు లోపలికి వచ్చాడు. అతను కొంచెం బెరుగ్గా చూస్తూ లోపలికి ప్రవేశించడంతో నేను కుతూహలంగా అతన్ని గమనిస్తూ కూర్చున్నాను. అతన్ని ఎక్కడో చూసిన గుర్తు వుంది. కానీ ఎవరో, ఏమిటో జ్ఞాపకం రాలేదు. అతను ఒక్కొక్కరి సీటు దగ్గర ఆగి ఏదో అడిగి, మళ్ళీ పక్క సీటు దగ్గరకు వెడుతున్నాడు. అతను ఏమడుగుతున్నాడో తెలీడంలేదు కానీ ప్రతివాళ్ళూ మొహం తిప్పుకోవడమో, లేదా ఏదో ఒక పని చేస్తు న్నట్టు నటించడమో చెయ్యసాగారు.

ఆ కుర్రవాడు ఆడవాళ్ళ వైపు రాకుండా మిగిలిన అందర్నీ అలా అడిగి బయటకి వెళ్ళిపోయాడు. అతను అందర్నీ అడిగిన విషయం ఏమై వుంటుంది అని ఆలోచిస్తూ కూర్చున్నాను. ఇంతలో పక్క సెక్షను సుజాత హడావిడిగా లోపలికి వస్తూనే "విజయా! చీరల మూటలవాడు వచ్చాడు. మంచి చీరలు అయిపోతు న్నాయి. త్వర గా రా'' అంటూ తొందర పెట్టేసింది. నేను కూడా పర్సు తీసుకుని తన వెంట బయలుదేరాను.

కారిడార్లోకి రాగానే ఇంతకు క్రితం నేను సెక్షనులో చూసిన కుర్రాడు ఏదో ఆలోచిస్తూ అక్కడి బెంచీ మీద కూర్చుని కనిపించాడు. విషయం ఏమిటో కనుక్కుందామని అతనివైపు కదిలాను. అది చూసి "అటు వెడుతున్నావేమిటి'' అంటూ సుజాత ఆశ్చర్యపోయింది. "పది నిమిషాలలో వస్తాను, నువు పద'' అని చెప్పి బెంచీవైపు అడుగులు వేసాను. నేను తన దగ్గర ఆగడం చూసి ఆ కుర్రాడు లేచి నిలబడ్డాడు. నాకంటే ఓ నాలుగైదేళ్ళు చిన్నవాడేమో!

"నిన్ను ఎక్కడో చూసినట్టు వుంది. ఇందాక అందర్నీ అడుగుతున్నావు-ఏమిటి?'' అని అతన్ని అడిగాను.

"నా పేరు రమేష్, నేను ఎ.ఎన్.ఆర్.కాలేజీలో బి.కాం. ఫైనలియర్ చదువుతున్నాను. ఇప్పటి వరకు ప్రైవేట్లు చెప్పి ఎలాగో గడిపాను. ఇప్పుడు పరీక్ష ఫీజు కట్టాలి. లాస్ట్ డే రేపే. అందుకని ఎవరైనా సహాయం చేస్తారేమో అని ఇలా ఆఫీసుకు వచ్చాను'' అంటూ సమాధానమిచ్చాడు. కాలేజీ పేరు చెప్పగానే అతను ఎవరో గుర్తొచ్చింది నాకు. నేను అదే కాలేజీలో డిగ్రీ ఫైనలియర్లో వుండగా అతను ఇంటర్ సెకండ్ ఇయర్ కాలేజ్ ఫస్ట్ వచ్చాడు. అప్పుడు జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో అతన్ని చూశాను.

"మీ ఇంట్లోవాళ్ళు ఫీజు కట్టరా? ఇలా అందర్నీ అడగడమెందుకు?'' అని అతన్ని ప్రశ్నించాను.

"మా అమ్మా, నాన్నకు మేం అయిదుగురు పిల్లలం. మాది మధ్యతరగతి కుటుంబం. మా చదువుల విషయం ఎవరూ పట్టించుకోరు. ఈ డిగ్రీ పూర్తయితే ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుని నా బతుకు నేను బతకగలను... కాని ఎవ్వరూ...'' ఆపైన మాట పెగలలేదతనికి.



# అమర్ ఖయ్యాం

లోకుల్ని కొంపలార్చి యెటులో గడియించిన పాడు డబ్బుతో
ఆకసమెత్తు గట్టితివి హర్మ్య; మదింకను లేచుచుండె పై
పైకి; మరేమి లేదు; అటుపై అట పై గదిలోన మృత్యువే
నీకు ఘటిల్లునేని నిను నేలకు దింపు టదెంత కష్టమో!

అచ్చపు పూలతోట జగమంత; యముండను మాలి నిత్యమున్
విచ్చిన పూలు గిల్లుకొని వెళ్ళును; "మాదగు వంతు నేఁ, డి కన్
వచ్చును రేపు మీ దయిన వం" తని అశ్రుకణాలు రాల్చుచున్
విచ్చని పూల వైపుగని విచ్చినపూల్ విలపించె పెద్దగా!!

అక్కడ రెక్కలూడి అణగారెడి పుష్పము వెచ్చనూర్చి నా
కొక్క రహస్యముం దెలిపె "ఓ నరుడా! జగమందు క్రూరులౌ
రక్కసు లున్నవారు; మన రక్తము పీల్తురు; చెప్ప కాళ్ళతో
ద్రొక్కుదు; రెంత ముట్టిపొగరో! మరి మెత్తనివారి జూచినన్."

పచ్చిగ పావులం గదిపి పందెములం దల్క్రిందు చేసి యీ
నిచ్చెన లెక్కినా ననుచు నిక్కకు; ప్రక్కకు జూడు మల్లదే!
విచ్చిన నోటితో బుసలు వెట్టెడి ఆ పెనుబాము నోటిలో
జొచ్చిన-చచ్చినట్లు తొలిచోటుకు జ ఱ్ఱున జారకుందువే!

ఇతనిది అందమైన మొగమే; మరి పున్నమ చందమామకున్
ప్రతియగు నట్టిదే; ప్రతి దినంబును లోకుల వెక్కిరించి ఈ
గతి వికృతిం గనెన్; పరుల కల్మికి ఏడ్చి తపించి వేదనా
హతి తెగమాడి "అట్లపెన" మట్లయిపోయె క్రమక్రమమ్ముగన్.

ఒక్క దినాన నే నడచుచుంటిని; మంటిని రెండు కాళ్ళతో
ద్రొక్కు కులాలు గంటిని; ఎదో నుడి వింటిని; "అంత మోటుగా
త్రొక్కకు! క్రుమ్మబోకు! మొకరోజున నీవలె నేను సైతమున్
జక్కనివాడనె! బలము సత్వము గల్గిన మానవుండనె."

డాక్టర్ కరుణశ్రీ "అమర్ ఖయ్యాం" పద్యకావ్యం నుంచి

ఇప్పుడు ఇతను ఫీజు కట్టి పరీక్షలు రాయకపోతే ఇతని ఆశలు, భవిష్యత్తు ఏమౌతాయో నాకు తెలియని విషయమేమీ కాదు. భగవంతుడి దయవలన నేను ఈ మాత్రం సహాయం చెయ్యగల స్థితిలో వున్నాను. పోనీ చీర ఇంకోసారి కొనుక్కోవచ్చు. ఆ డబ్బు ఇతనికి ఇస్తే ఒక మంచి పని చేసినట్టవుతుంది అని అనిపించింది. ఇక నేను ఏం ఆలోచించకుండా వెంటనే పర్సు తెరిచి మూడు వందలు అతని చేతిలో పెట్టాను. అతను నమ్మలేనట్టు విభ్రాంతిగా నావైపు చూశాడు.

"టైం వేస్ట్ చెయ్యకు. ఫీజు కట్టేసి శ్రద్ధగా చదువుకో. నువ్వు ఇంటర్‌లో కాలేజ్ ఫస్ట్ వచ్చినట్టు నాకు తెలుసు. ఈసారి కూడా అలాగే రావాలి" అని చెప్పాను.

అతను "అలాగే మేడం, తప్పకుండా అలాగే పాసవుతాను. మీ మేలు ఎప్పటికీ మర్చిపోను" అంటూ ఎన్నో కృతజ్ఞతలు చెప్తూ చేతులు జోడించి వెళ్ళిపోయాడు. చీర కొనే కార్యక్రమం వాయిదా వేసి నేను నా సీటు దగ్గరకు వెళ్ళిపోయాను.

**  **  **

సుమారు ఆరు నెలలు గడిచి వుంటాయి. ఒకరోజు మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ రమేష్ ఏవో స్వీట్ పాకెట్లు పట్టుకుని నా దగ్గరకు వచ్చాడు.

"రా, రా! ఏమిటి విశేషాలు? పరీక్ష పాసయి వుంటావు! అంతేనా!?" అన్నాను సంతోషం వెల్లివిరుస్తున్న అతని ముఖం చూస్తూ.

"అది కాదు మేడం! నేను కాలేజీ ఫస్ట్ రావడమే కాదు, స్టేట్ లెవెల్లో సెకండ్ వచ్చాను. రిజల్ట్ తెలియగానే నాకు గుర్తొచ్చింది మీరొక్కరే. అప్పుడే మీ దగ్గరకు వచ్చి చెబుదామనుకున్నాను. ఇంతలో నేను ఫైనలియర్లో వుండగా రాసిన రైల్వే పరీక్ష పాసయినట్టు ఇంటర్వ్యూకి రమ్మంటూ కాల్ లెటర్ వచ్చింది. ఇక ఆ హడావిడిలో మీ దగ్గరికి రావడం కుదరలేదు. ఈ రోజు అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. నేను వారం రోజులలో విజయవాడలో జాయిన్ కావాలి. ఇదంతా మీ చలవ. మిమ్మల్ని నేను మరచిపోలేను" అంటూ ఏమిటేమిటో చెప్పసాగాడు.

"ఆగాగు. నేను కేవలం పరీక్ష ఫీజు మాత్రమే కట్టాను. ఉద్యోగం నీకు నువ్వే సంపాదించుకోగలిగావు కదా. ఈ విషయంలో నా గొప్ప ఏమీ లేదు" అంటూ అతన్ని ఆపేశాను.

"లేదు మేడం. ఈ ఉద్యోగం వస్తుందని మీకు తెలియక ముందే నాకు సహాయం చేశారు. ఒకవేళ ఈ ఉద్యోగం రాకపోతే నాకు ఆ డిగ్రీయే ఆధారం అయ్యేది. నాకా సంగతి బాగా తెలుసు. ఇక నుండి నేను కూడా తోటివాడికి చేతనైన సహాయం చేస్తాను. ఇదంతా మీ చలవ." అంటూ నన్ను కృతజ్ఞతలతో ముంచెత్తి వెళ్ళాడు. అతని కళ్ళలో మెరిసిన కృతజ్ఞత చూసిన నాకు చాలా సంతోషంగా అనిపించింది. నేనారోజు ఆ పని చెయ్యకపోతే, ఈ ఆనందం నాకు దక్కేది కాదు. ఈ తృప్తి, హాయి ముందు చీర కొనుక్కుంటే కలిగే ఆనందం, సంతోషం ఏపాటిది!?